


డా.సదానంద్ శారద

# ఎంత బాగా చెప్పావోయ్...

"ఒక్క ప్లేటు వేడి వేడి పకోడి చేసి పెడ్తావా వీణా"

"ఈ పూట పకోడి తినాలనిపిస్తున్నదా?"

"అవునోయ్"

"ఉల్లిపాయలు తరిగివ్వు. అట్లాగే చేస్తా"

"వీణా.."

"ఆ.."

"వీణా"

"ఆ..అంటున్నా కదా.."

"అది కాదు వీణా"

"ఏది కాదు...ఉల్లిపాయలు తరగవా..పకోడి తినవా?"

"నాకు..."

"ఊ...నీకు"

"నాకు ఏడుపొస్తుంది కదా వీణా.."

"ఎందుకు రాంబాబూ?"

"ఉల్లిపాయలు తరిగితే..."

"ఆ వంకతో పని తప్పించుకుందామనే...దాన్ని ఏడ్పు అనరు"

"మరి?"

"కళ్లలో నీళ్లొస్తాయి అంటారు"

"రెండూ ఒకటి కాదా?"

"ఎట్లా అవుతాయి. పొగమంచు, పొగ ఒకటేనా?"

"కాదు..కాదు.."

"మరి ఉల్లిపాయలు తరిగివ్వు..వేడి వేడి పకోడి చేసి పెడ్తాను"

"అంటే పనులన్నీ సగం పంచుకోవాలా?"

"అదేంటోయ్..నువ్వూ నేను చెట్టాపట్టాలేసుకొని పనిచేస్తే ఎంత బాగుంటుందో"

"అవుననుకో..బజారులో పకోడిలో బోలెడు దుమ్ము, రోగాలు కదా..ఇదే నయం..కాస్సేపు కన్నీళ్లకు ఓర్చుకుంటే రుచికరమైన ఆరోగ్యకరమైన పకోడీ.."

"వెరీ గుడ్.."

"వీణా.."

"ఏంటి రాంబాబూ..."

"వేడి వేడి పకోడి ఎందుకో తెలుసా?"

"ఎందుకు? తినడానికి.."

"ఉహూ..."

"తినిపించడానికా?"

"ఊహూ.."

"ఎందుకబ్బా!"

"నాకు ఒక గొప్ప కథ రాయాలి అనిపిస్తున్నదోయ్"

"ఓహో..ముందు కథ రాసిన తరువాత కదా అది గొప్పదో కాదో తెలిసేది?"

"నువ్వు పకోడి చేయవోయ్..కథ అదే వస్తుంది"

"నువ్వు ఉల్లిపాయలు తరగవోయ్..పకోడి అదే వస్తుంది"

"సరే.."

"సరే.."

★ ★ ★

"పకోడి బాగుందా?"

"చాలా బాగుందోయ్"

"ఉహూ..."

"చాలా చాలా బాగుంది"

"ఉహూ..మరి కథ మొదలుపెట్టు"

"అదే ఆలోస్తున్నా.."

"దేని గురించి కథ గురించా..కథావస్తువు గురించా?"

"కథావస్తువు గురించి..."

"ఇంట్లో కూర్చొని కథావస్తువు గురించి ఆలోచిస్తున్నావా?"

"ఆ..."

"బాగుంది"

"ఎందుకు బాగుండదూ..ఒక కప్పుడు కాఫీ అందుకో. కథ రాసేస్తాను"

"కప్పుడు కాదు..సగం"

"నువ్వు సగం..నేను సగమా?"

"ఔను..."

"సరేకానీ..."

★ ★ ★

"రాంబాబూ.."

"చెప్పువీణా.."

"కాఫీ అయిందా?"

"ఊ.."

"మరి కథ?"

"అదే ఆలోచిస్తున్నా.."

"ఓహో..ఆలోచిస్తూ ఉండు..అట్లా నేను బజారుకెళ్లి వస్తాను"

"ఓ యస్ అలాగే..నేను కథ రాయాలి కదా. బయటికి రాను"

"తలుపులు వేసుకో"

"అలాగే.."

"తలపులు కాదు..తలుపులు"

"అలాగే..."

"వస్తా.."

"అలాగలాగే.."

★ ★ ★

"ఎంతసేపయింది వీణా..నువ్వు వచ్చి?"

"గంట.."

"అవునా!"

"ఆ.."

"నాకు తెలియనే లేదు"

"ఎట్లా తెలుస్తుంది గుర్రుపెట్టి నిద్రపోతుంటే"

"నేను నిద్రపోతున్నానా!!"

"గుర్రుపెట్టి"

"అంత నిద్రా?"

"మొద్దు నిద్ర అంటారే అది"

"తలుపులు వేసుకోకుండానే.."

"నీ అదృష్టం బాగుంది.."

"నా అదృష్టం బాగుందా..ఎందుకు?"

"ఏదైనా వస్తువు పోయి వుంటే మొట్టికాయలు తిని వుండువు కదా.."

"అవునవును. నా తలకాయ అదృష్టం బాగుండి ఏ వస్తువు పోలేదన్నమాట..."

"కథ రాసి పడుకున్నావా ప్రాణనాథా?"

"ఉహూ.."

"అరరే ఏమయింది?"

"వేడి వేడి పకోడి పెట్టావు"

"ఉ..."

"ఆ తరువాత వేడి వేడి కాఫీ ఇచ్చావ్"

"ఉ..."

"హాయిగా నిద్రపట్టేసింది"

"ఉహూ.."

"ఎందుకా నవ్వు?"

"కథ అంత సులభంగా వస్తుందోయ్..టిఫిన్లు, కాఫీలతో నిద్ర వస్తుంది కథ కాదు..."

"కాదా!"

"పురిటినొప్పులు పడనిదే కథనెలాకంటావోయ్?"

"అంటే కథలు ఆడవాళ్ళే రాయాలని నీ ఉద్దేశమా?"

"ఓహో బుజ్జిబాబూ..పురిటి నొప్పులంటే ఆ అర్థం తీసుకున్నావా! అంత అంతర్గత తపన పడాలన్నమాట కథ రాయాలంటే"

"అవునా!"

"ఆ..."

"అమ్మో..కథ వెనుక ఇంత కథ వుంటుందా!"

"మరేమనుకున్నావ్.."

"మూడ్ తెప్పించడానికి పకోడి..రాయడానికి కలం, కాగితం ఉంటే సరిపోతాయి అనుకున్నాను"

"నాతో బయటికి వస్తే నీకు బోల్డన్ని వస్తువులు దొరికేవి"

"అంటే సరుకులేనా.."

"కాదు..కథా వస్తువులు"

"అర్థం కాలేదోయ్.."

"డియర్ రాంబాబూ..కథావస్తువు బుర్రలో కాదోయ్..సమాజం నుంచి పుడుతుంది. సమాజం నుంచి సమాజానికి కథాగమనం అన్నారు తెలుసా.."

"ఏదీ మరోసారి చెప్పు.."

"కథావస్తువు బుర్రలో కాదోయ్..సమాజం నుంచి పుడ్తుంది.."

"ఎంత బాగా చెప్పావోయ్!"

